సాక్షి
నిర్మల్

శుక్రవారం । 12 । జూలై । 2024



అంతమొందిస్తున్నారు!

మానవ సంబంధాలు 'మనీ' చుట్టూ తిరుగుతున్నాయి. పలువురు మానవ మృగాలుగా మారుతున్నారు. వివిధ కారణాలతో క్షణికావేశానికి లోనై అయినవారినీ కడతేర్చుతున్నారు. 8లో ▸



సీఎం దృష్టికి.. సమస్యలు

బాసర ఆర్జీయూకేటీ విద్యార్థులు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యలు విన్నవించారు. ఒక్కసారి ట్రిపుల్‌ఐటీకి వచ్చి సమస్యలు పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.0 /25.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఆలయంలో జిల్లా జడ్జి పూజలు



జడ్జిని సత్కరిస్తున్న జగన్మోహన్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని గండి రామన్న దత్తసాయి ఆలయ ప్రాంగణంలో జిల్లా న్యాయమూర్తి కర్ణకుమార్ గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిదీక్ష సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి ఈ సందర్భంగా జిల్లా జడ్జిని సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయనవెంట వైద్యుడు ప్రవీణ్‌కుమార్, సమితి సభ్యులు పాల్గొన్నారు.

రాథోడ్ మరణం తీరని లోటు



రాథోడ్ రమేశ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ మరణం బీజేపీకి తీరని లోటని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రాథోడ్ రమేశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఆదిలాబాద్ జిల్లాకు రాథోడ్ రమేశ్ అందించిన సేవలను కొనియాడారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, నాయకులు భూమయ్య, రాంనాథ్, రాజేశ్వర్ రెడ్డి, రాజు, అలివేలుమంగ, రజని వైద్య, శ్రావణ్‌రెడ్డి, సాగర్, అర్జున్, విలాస్, అరవింద్, నవీన్, రాజేందర్, శంకరపతి, నరేశ్, శ్రావణ్, సుధాకర్, కార్తిక్, భరత్ తదితరులున్నారు.

వైపరీత్యాల నుంచి కాపాడాలి



లైఫ్‌బోట్ గురించి వివరిస్తున్న సిబ్బంది

భైంసాటౌన్: ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడిన సందర్భంలో ప్రజలను కాపాడాలని ఏఎస్పీ అవినాష్‌కుమార్ సూచించారు. స్థానిక గడ్డెన్న వాగు ప్రాజెక్ట్ వద్ద ఎన్డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందికి విపత్తు నిర్వహణపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వరదలు సంభవించినప్పుడు నీటిలో చిక్కుకున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే లైఫ్ బోట్ సేవలపై ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది పోలీసులకు అవగాహన కల్పించారు. అనంతరం ఏఎస్పీ, సీఐ డీ రాజారెడ్డితో కలిసి లైఫ్‌బోట్‌లో ప్రయాణించారు. ఇతర పోలీస్ సిబ్బంది కూడా లైఫ్‌బోట్‌లో ప్రయాణించి పనితీరు తెలుసుకున్నారు. డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

'డబుల్' ఇళ్లు అప్పగించాలి



ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

భైంసాటౌన్: పట్టణ శివారులో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజు, అంబేడ్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గిరిధర్ జంగ్మే డిమాండ్ చేశారు. లబ్ధిదారులతో కలిసి గురువారం పట్టణంలో ఆందోళన చేశారు. ర్యాలీగా ఎమ్మెల్యే రామారావుపటేల్ నివాసానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. లబ్ధిదారులను ఎంపిక చేసి ఏడాదవుతున్నా నేటికీ ఇళ్లు అప్పగించలేదని ఎమ్మెల్యేతో చెప్పారు. అధికారుల చుట్టూ తిరిగినా స్పందించడం లేదని ఆరోపించారు. డబుల్‌బెడ్రూం గృహ సముదాయంలో మౌలిక వసతులు కల్పించి, ఇళ్లు అప్పగించేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నాయకులు రాము, నయీం, సతీశ్, అఫ్సాన్, షేక్ మౌలా, భాస్కర్, లక్ష్మణ్, మహిళలు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

నిర్మల్‌టౌన్: సిద్దిపేటలో న్యాయవాది ఎం.రవికుమార్‌పై పోలీసులు దాడి చేయడాన్ని ఖండిస్తూ నిర్మల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లాడుతూ.. న్యాయవాదులపై దాడులు చేయడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే న్యాయవాద రక్షణ చట్టం తీసుకువచ్చి న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరారు.

- ఎవుసం చేసేటోళ్లకు సాయం అందాలి
- 'కౌలు'ను ఆదుకోవాలి.. పోడును మరువొద్దు
- క్యాబినెట్ సబ్ కమిటీ ఎదుట ఉమ్మడి జిల్లా రైతులు..
- అన్నదాత అభిప్రాయాలు సేకరించిన మంత్రులు, అధికారులు



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. పక్కన మంత్రులు తుమ్మల, పొంగులేటి, సీతక్క, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు తదితరులు

రైతుకే భరోసా..

సాక్షి, ఆదిలాబాద్: 'కౌలు రైతులకు న్యాయం జరగాలి.. పోడు భూములకూ భరోసా కల్పించాలి.. ఒకే కుటుంబంలో ఉన్న పట్టాదారులందరికీ న్యాయం చేయాలి.. పదెకరాల వరకు పథకం ఉండాలి.. మళ్లీ కౌలురైతు చట్టం తేవాలి.. రియల్ ఎస్టేట్ వాటిని మినహాయించి సాగు భూములకే పథకాలు వర్తింపజేస్తూ అన్నదాతకు భరోసా కల్పించాలి. ఈ ప్రాంత రైతులకు కొన్ని ప్రత్యేక పరిమితులు కల్పించేలా విధి విధానాలు ఉండాలి.. సాగు మొదట్లోనే సాయం అందాలి. వానాకాలం, యాసంగికి ముందు జూన్, డిసెంబర్‌లోనే పెట్టుబడి సాయం ఖాతాల్లో జమకావాలి' ఇలా ఉమ్మడి జిల్లా రైతులు, రైతు సంఘాల నాయకులు 'రైతు భరోసా'పై తమ అభిప్రాయాలను మంత్రివర్గ ఉపసంఘం ఎదుట వెలిబుచ్చారు. ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా అన్నదాతకు న్యాయం చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు తమ సూచనలు అందించారు.

కేబీ కాంప్లెక్స్‌లో సమావేశం

రైతు భరోసా పథకం అమలులో విధివిధానాలు రూపొందించేందుకు ప్రభుత్వం రైతుల నుంచే అభిప్రాయాలు సేకరిస్తోంది. ఇందుకోసం నియమించిన మంత్రివర్గ ఉప సంఘం గురువారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌కు వచ్చింది. ఐటీడీఏ కేబీ కాంప్లెక్స్‌లో సమావేశం నిర్వహించారు. ఉప సంఘం చైర్మన్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన సభ్యులు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పాల్గొని రైతుల అభిప్రాయాలు విన్నారు. అలాగే ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ దండే విఠల్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ కలెక్టర్లు రాజర్షిషా, అభిలాష అభినవ్, కుమార్‌దీపక్, వెంకటేశ్ దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు. ఉదయం 11.20 గంటలకు మంత్రివర్గ ఉప సంఘం వేదికపైకి చేరుకుంది. మధ్యాహ్నం 2.30 గంటల వరకు సమావేశం కొనసాగింది. ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా, ఇతర అధికారులు ప్రజాప్రతినిధులకు స్వాగతం పలికారు. సమావేశం ముగిసిన తర్వాత ఉప ముఖ్యమంత్రి, మంత్రులు హైదరాబాద్‌కు తిరిగి వెళ్లారు.



సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా రైతులు

ధరణి కారణంగా అనేక సమస్యలు..



వ్యవసాయ భూములకు సంబంధించి ధరణి కారణంగా అనేక సమస్యలు తలెత్తాయి. ఎప్పుడో భూములు వదిలేసి, అమ్ముకుని వెళ్లిన వారు ధరణిలో తిరిగి తమ పేరు రావడంతో ఆ భూములను చిన్న, సన్నకారు రైతుల నుంచి గుంజుకుంటున్నారు. రైతు బంధుకు సంబంధించి ఎన్‌ఆర్‌ఐలు కూడా ఎక్కడో ఉండి ఇక్కడ ఉన్న పొలాలకు చెక్కులు పొందుతున్నారు. ఇవన్నీ పరిగణనలోకి తీసుకుని క్షేత్రస్థాయిలో అభిప్రాయ సేకరణ జరుపుతున్నాం.

– సీతక్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి

పరిమితులొద్దు



రైతు భరోసా పథకం అమలులో మంత్రివర్గం ఇప్పటివరకు ఎలాంటి పరిమితులు విధించలేదని చెబుతున్నారు. దీంట్లో ఏదో చేయాలనే ఉద్దేశం లేదని ప్రభుత్వ పెద్దలు పేర్కొంటున్నారు. ఎలాంటి పరిమితులు లేకుండా యథావిధిగా అమలు చేస్తే సంతోషమే.

– గోడం నగేశ్, ఆదిలాబాద్ ఎంపీ

ఆమోదయోగ్యంగా ఉండాలి



రైతు భరోసా పథకం అమలులో విధివిధానాల రూపకల్పన కోసం ప్రభుత్వం క్షేత్రస్థాయిలో అభిప్రాయ సేకరణకు రావడం గర్వించదగిన విషయం. ఇది అందరికీ ఆమోదయోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నాను.

– గడ్డం వంశీ, పెద్దపల్లి ఎంపీ

పదెకరాల వరకు అమలు చేయాలి



రైతులకు విపత్తు సమయంలో పరిహారం అందించే ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలి. రైతుల ప్రీమియం డబ్బులు ప్రభుత్వమే చెల్లించాలి. బడా పారిశ్రామిక వేత్తలు, మూడు పంటలు సాగు చేసే పెద్ద రైతులకు పంట పెట్టుబడి సాయం అందించకుండా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ముందుకెళ్లాలి. పదెకరాలు సాగు చేసే రైతులందరికీ రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలి.

– పాయల్ శంకర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే


'పోడు' పరిష్కరించాలి



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ముఖ్యంగా సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజకవర్గానికి సంబంధించి ముఖ్యమైన ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని పూర్తి చేసే విషయంలో ప్రభుత్వం దృష్టి సారించాలి. పోడు భూముల సమస్య పరిష్కారానికి చొరవ చూపాలి.

– పాల్వాయి హరీశ్‌బాబు, సిర్పూర్ ఎమ్మెల్యే

రైతుల ప్రయోజనాలు కాపాడాలి



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతుల ప్రయోజనాలను కాపాడే విధంగా మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయం తీసుకోవాలి. ఇక్కడి రైతులు ఎంతో శ్రమపడి పంటలను సాగు చేస్తున్నారు. ఆ మేరకు ప్రయోజనాలు దక్కడం లేదు.

– రామారావు పటేల్, ముధోల్ ఎమ్మెల్యే

స్పెషల్ ప్యాకేజీ ప్రకటించాలి



వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 80 శాతం రైతులు వర్షాధారంపైనే పంటలు సాగు చేస్తున్నారు. ఈ జిల్లాకు ప్రభుత్వం స్పెషల్ ప్యాకేజీ ప్రకటించాలి. ప్రత్యేకంగా బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించి ఆదుకోవాలి.

– ప్రేమ్‌సాగర్‌రావు, మంచిర్యాల ఎమ్మెల్యే

కౌలు రైతుకూ మేలు జరగాలి



రైతు భరోసా అమలులో కౌలు రైతులనూ పరిగణనలోకి తీసుకోవాలి. వారికి ఎలాంటి ప్రయోజనాలు దక్కడం లేదు. ఈ విషయంలో వారికి ప్రయోజనం దక్కేలా విధివిధానాలు రూపొందించాలి.

– గడ్డం వివేక్, చెన్నూర్ ఎమ్మెల్యే

పోడు సమస్య పరిష్కరించాలి



పోడు సాగును అధికారులు అడ్డుకుంటున్నారు. దీంతో ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న ఆ రైతులకు నష్టం జరుగుతుంది. ఈ విధానాలు ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా ఉన్నాయి. ధరణితో తిరిగి పట్టాలు పొందిన భూస్వాములకే రైతు భరోసా లబ్ధి చేకూరుతుంది. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరులకు పట్టాలు లేవు. అనాదిగా ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. రెవెన్యూ శాఖ ఈ సమస్యను పరిష్కరించాలి.

– వెడ్మ బొజ్జు, ఖానాపూర్ ఎమ్మెల్యే

విమర్శలు సరికాదు



గత ప్రభుత్వం అప్పులు చేసిందని, పథకాల అమలులో తప్పులున్నాయని విమర్శలు సరికాదు. రైతుబంధు ప్రతీ రైతుకు ఇవ్వడం జరిగింది. అలాగే కోట్లాది రూపాయలతో ప్రతి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పూర్తయ్యాయి.

– అనిల్ జాదవ్, బోథ్ ఎమ్మెల్యే

ఆంక్షలు విధించవద్దు



అన్నివర్గాల రైతులను ఆదుకున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబంధు పథకంతో ప్రజలకు చేరువయ్యారు. ఈ పథకంలో ఆంక్షలు వద్దు. ఏజెన్సీ ప్రాంత గిరిజనేతరులకు పట్టాలు లేవు. వారికి రైతు భరోసా ఏ విధంగా ఇవ్వాలో ఆలోచన చేయాలి.

– కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే

కౌలు చట్టాన్ని అమలు చేయాలి



2011 కౌలు చట్టాన్ని తిరిగి అమలు చేయాలి. సాగు చేసుకుంటున్న నిజమైన రైతుకు న్యాయం జరగాలి. 30నుంచి 40 శాతం మంది కౌలు రైతులే ఉన్నారు. వారికి ఎలాంటి ప్రయోజనాలు దక్కకపోవడంతో సాగులో నష్టాలు చవిచూసి 95 శాతం మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.– క్లైం కరుణాకర్‌రెడ్డి, రైతు, తలమడుగు

పదెకరాల వరకు ఇవ్వాలి



పదెకరాల వరకు రైతు భరోసాను ఇస్తే బాగుంటుంది. పంటను అమ్ముకునే రైతులకు బోనస్ కల్పించాలి.

– బోరంచు శ్రీకాంత్ రెడ్డి, రైతు, మావల

సగం సగం ఇవ్వండి



రైతు భరోసా పథకం అమలులో కౌలు రైతులకు న్యాయం చేయాలి. అందుకోసం వారికి సగం.. పట్టా భూములు ఇచ్చిన వారికి సగం ఆర్థిక సాయం అందేలా చూడాలి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పదెకరాలు సాగు చేసే రైతులందరికీ తప్పకుండా రైతు భరోసా వర్తింపజేయాలి.

– మెస్రం జంగు, రైతు

చెరువుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలి

- బీజేపీ అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి
- గొలుసుకట్టు చెరువుల పరిశీలన



గొలుసుకట్టు చెరువును పరిశీలిస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని గొలుసుకట్టు చెరువుల పరిరక్షణకు కలెక్టర్, జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. 'చెరువుకు దరువు-వరదకు అడ్డు' కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలో పార్టీ నాయకులు మంజులాపూర్‌లోని రామ్‌సాగర్, బీసీపీ రామ్‌సాగర్, ఇబ్రహీం చెరువులను సందర్శించారు. చారిత్రక చెరువులు అస్తిత్వాన్ని కోల్పోయేలా రియల్టర్లు విచ్చలవిడిగా చెరువు భూములు ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. చెరువు భూములు కాపాడడానికి కంచె వేయాలని గతంలో హైకోర్టు తీర్పు ఇచ్చినా అధికారుల నిర్లక్ష్యంతో రియల్టర్లు యథేచ్ఛగా ఆక్రమణలు చేస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్, అధికారులు వెంటనే గొలుసుకట్టు చెరువులను సందర్శించి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో కార్యాచరణ రూపొందించి ప్రజాఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట రాష్ట్ర నాయకుడు రావుల రామనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు మెడిసిమ్మె రాజు, అలివేలు మంగ, రజని వైద్య, శ్రావణ్‌రెడ్డి, రాచకొండ సాగర్, ఒడిసెల అర్జున్, శ్రీగాదే విలాస్, అరవింద్, రాజేందర్, నరేశ్, శ్రావణ్, సుధాకర్, కార్తిక్, భరత్, కౌన్సిలర్లు నవీన్, రాజేందర్, శంకరపతి ఉన్నారు.

గోవధశాలను తొలగించాలి

పట్టణ శివారులోని ఇబ్రహీం చెరువు సమీపంలోగల గోవధశాలను తొలగించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇబ్రహీం చెరువును సందర్శించి అక్కడ వధించేందుకు తెచ్చిన 100కు పైగా ఆవులను గుర్తించి నిర్మల్ పోలీసుల సహకారంతో గోశాలకు తరలించారు.

నగదురహిత వైద్యం అందించాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న పెన్షనర్లు

నిర్మల్‌చైన్‌గేట్: విశ్రాంత ఉద్యోగులకు పీహెచ్‌ఎస్ ద్వారా మూలవేతనంలో ఒక శాతాన్ని మినహాయించి వెంటనే నగదు రహిత వైద్యం అందించాలని పెన్షనర్ల సంఘం జాతీయ కార్యదర్శి ఎంసీ లింగన్న కోరారు. తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం జిల్లా పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకుని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. కమిటేషన్‌ను 15 సంవత్సరాల నుంచి 12 సంవత్సరాలకు తగ్గించాలని, పెండింగ్ డీఏ వెంటనే చెల్లించాలని, రూ.398 వేతనంతో నియమితులైన వారికి నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని కోరారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.హనుమంత్‌రెడ్డి, నాయకులు చందూలాల్, శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించేలా చూడాలి



లోకేశ్వరం మండల సమాఖ్య కార్యాలయ ఆవరణలో మొక్క నాటుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

లోకేశ్వరం: ఎస్‌హెచ్‌జీ సభ్యులు రుణాలు సకాలంలో చెల్లించేలా చూడాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో సీఏలతో సమీక్ష నిర్వహించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ.. గ్రామాల్లో చేపట్టే అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు త్వరగా పూర్తి చేయించాలని సూచించారు. స్త్రీనిధి రుణాలు తీసుకున్నవారు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చూడాలని పేర్కొన్నారు. నెలనెలా గ్రామాల్లో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఎంపీడీవో సోలమాన్‌రాజ్, ఏఎస్పై దిగంబర్, ఏపీవో జగన్నాథ్, ఏపీఎం, మల్లేశ్, సీసీలు, సీఏలున్నారు.

'అధిక జనాభా అభివృద్ధికి ఆటంకం'

నిర్మల్‌చైన్‌గేట్: అభివృద్ధికి అధిక జనాభా ఆటంకమని, కుటుంబ నియంత్రణ పద్ధతుల ద్వారా నియంత్రివచ్చని డీఎంహెచ్‌వో ధనరాజ్ తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా కేంద్రంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికజనాభా ద్వారా తలెత్తే దుష్పరిణామాలను ప్రజలకు వివరించాలని సూచించారు. జనాభా పెరుగుదల సమస్యలపై అవగాహన కల్పించేందుకు ప్రతీ సంవత్సరం జూలై 11న ప్రపంచ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్, డాక్టర్ శ్రీనివాస్, నోడల్ ఆఫీసర్ సౌమ్య, డిప్యూటీ జిల్లా, విస్తరణాధికారి రవీందర్, హెచ్‌ఈవో వేణురావు, సూపర్‌వైజర్లు భోజారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆరోగ్య సహాయకులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీ తీస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మస్థైర్యంతోనే అన్నింటా విజయం

భైంసారూరల్: ఆత్మస్థైర్యం ఉంటే అన్నింటా విజయం సాధించవచ్చని డీఆర్డీవో విజయలక్ష్మి పేర్కొన్నారు. గురువారం భైంసాలోని ఐకేపీ భవనంలో నిర్వహించిన దివ్యాంగ్ శక్తి ఫౌండేషన్ మొదటి వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ప్రత్యేకావసరాలు గల విద్యార్థులు పదో తరగతిలో అద్భుత ఫలితాలు సాధించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. దివ్యాంగ్ శక్తి ఫౌండేషన్ వీరిని గుర్తించడం అభినందనీయమన్నారు. ప్రత్యేకావసరాలు గల పిల్లలకు ఏ సహాయం చేసేందుకైనా తాను సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. పదో తరగతి ఫలితాల్లో రాణించిన పలువురు విద్యార్థులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు విజయానంద్, ఎంఈవో సుభాష్, ఫౌండేషన్ సభ్యుడు మహేశ్, ఐకేపీ ఏపీఎం లక్ష్మణ్ తదితరులున్నారు.

క్లుప్తంగా

సీఏ ఫలితాల్లో మెరిసిన రైతుబిడ్డ


రోషిణి రెడ్డి

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన రైతు ఇప్ప భోజారెడ్డి, వీణా రెడ్డి దంపతుల కుమార్తె రోషిణిరెడ్డి సీఏ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించింది. సామాన్య కుటుంబంలో జన్మించిన రోషిణిరెడ్డి పదోతరగతి వరకు నిర్మల్ రూరల్ మండలంలోని సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో, ఇంటర్ హైదరాబాద్‌లోని నారాయణ జూనియర్ కళాశాలలో, సీఏ హైదరాబాద్‌లోని లక్ష్య కళాశాలలో అభ్యసించింది. సీఏ ఫైనల్ ఇయర్‌లో ఉండగా నిత్యం ఆన్‌లైన్ క్లాసులు వింటూ చదివింది. కష్టతరమైన సీఏను ఇష్టంతో చదివి పాసైన రోషిణి రెడ్డిని మండల వాసులు అభినందిస్తున్నారు.

‘ఉదారి’కి సాహితీ కిరణం అవార్డు

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన ప్రముఖ కవి డాక్టర్ ఉదారి నారాయణ సాహితీ కిరణం అవార్డుకు ఎంపికైనట్లు సాహితీ కిరణం సంపాదకుడు కొత్తూరు సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదారి రాసిన ‘మళ్లీ మనిషిలోకి’ కవితా సంపుటికిగానూ ఈ అవార్డు అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈనెల 19న హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో అవార్డు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సారంగపూర్: మండలంలోని అడెల్లి గ్రామశివారులో గురువారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసివెళ్లి అడెల్లి గ్రామ శివారు ప్రాంతంలో పేకాట స్థావరంపై దాడి చేశారు. 8 మందిని అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి పేకముక్కలు, రూ.18,400 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై దాడులు

నర్సాపూర్ (జి): మండల కేంద్రంలోని కొచ్చెర చెరువు వద్ద గురువారం రాత్రి పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఇద్దరు నిందితులను పట్టుకుని వారి వద్ద నుంచి రూ.1,050 నగదు , 2 సెల్‌ఫోన్లు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు. మరో ఇద్దరు వ్యక్తులు పారిపోయారని, నిందితులపై పెట్టీకేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆలయాల్లో చోరీ నిందితుల అరెస్టు

భీమ్‌గల్: నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లోని వివిధ ఆలయాల్లో చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ తెలిపారు. కేసులకు సంబంధించిన వివరాలను గురువారం వెల్లడించారు. బాల్కొండకు చెందిన బట్టు సతీశ్, ఆర్మూర్‌కు చెందిన చిట్యాల రాజు, రూపేశ్ ముఠాగా ఏర్పడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లోని పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడ్డారు. ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి, భీమ్‌గల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, ఇన్‌చార్జి ఎస్సై రాజశేఖర్, ఏఎస్సై చిరంజీవి రెండు బృందాలుగా ఏర్పడి కేసుల దర్యాప్తు చేపట్టారు. గురువారం భీమ్‌గల్ నందిగల్లీ పోచమ్మ ఆలయం వద్ద వాహనాలు తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా వ్యవహరించిన బట్టు సతీశ్, చిట్యాల రాజును అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. నిందితుల నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ముఠా సభ్యుడు రూపేశ్‌ను త్వరలోనే పట్టుకుంటామన్నారు. నిందితులను అరెస్టు చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు బృందం సభ్యులను ఆర్మూర్ ఏసీపీ అభినందించారు.

అంతమొందిస్తున్నారు!



కొడుకే కాలయముడై..

నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం లక్ష్మీనగర్ తండాకు చెందిన లౌడియా ఇందిరాబాయి (64)ను ఆమె కుమారుడు రాంబాబు దారుణంగా హత్య చేశాడు. ఇందిరాబాయికి, రాంబాబుకు మధ్య కుటుంబ సమస్యలపై గొడవ జరిగింది. కుమారుడిని దుర్భాషలాడడంతో ఆగ్రహానికి గురైన రాంబాబు క్షణికావేశంలో పక్కనే ఉన్న కొడవలి తీసుకుని దాడిచేశాడు. తీవ్రంగా గాయపడిన ఇందిరాబాయి అక్కడికక్కడే కుప్పకూలింది.

కొడుకును కడతేర్చిన తండ్రి..

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం ఆకెనపల్లిలో భూమి పంపకం విషయంలో తలెత్తిన గొడవలో తండ్రి తనయుడిని కడతేర్చాడు. గ్రామానికి చెందిన దేవ మారాలు, బీరక్క దంపతులకు ఇద్దరు కుమారులు వినోద్ (30), దేవ వినీల్ సంతానం. డిగ్రీ చదివిన వినోద్ ఇంటివద్ద ఉంటూ వ్యవసాయం, కూలీ పనులు చేసేవాడు. తమకున్న రెండెకరాల వ్యవసాయభూమిని పంచివ్వాలని వినోద్ కొన్ని రోజులుగా తండ్రితో గొడవ పడుతున్నాడు. కొడుకు వేధింపులు భరించలేని తండ్రి పారతో కుమారుడి తలపై విచక్షణారహితంగా దాడిచేసి హతమార్చాడు.

- మంటగలుస్తున్న మానవత్వం
- విచ్ఛిన్నమవుతున్న ఆత్మీయ బంధాలు
- ఆందోళన కలిగిస్తున్న వరుస హత్యలు
- ఆస్తి తగాదాలు, వివాహేతర సంబంధాలే హత్యలకు ఊతం

మంచిర్యాలక్రైం: మానవత్వం మంటగలుస్తోంది.. మానవ సంబంధాలు ‘మనీ’ చుట్టు తిరుగుతున్నాయి. ఆస్తి కోసం క్షణికావేశంలో అయిన వారినే కడతేరుస్తున్నారు. అనుమానంతో ఒకరిని.. వివాహేతర సంబంధంలో మరొకరు.. పాత కక్షలతో ఇంకొకరు.. ప్రేమ వ్యవహారంలో మరొకరు.. ఆస్తి తగాదాలతో ఒకరు.. ఇలా చెప్పుకుంటూ పోతే కారణాలు ఏవైనా కావచ్చు..మానవ మృగాలుగా మారి మనుషులనే హతమారుస్తున్నారు. మానవ విలువలకు తిలోదకాలిస్తున్నారు. కొందరు నేరాలు చేయడానే ప్రవృత్తిగా ఎంచుకుంటున్నారు. హత్యలను నివారించడం పోలీసులకు పెను సవాల్‌గా మారింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇటీవల జరిగిన వరుస హత్యలపై ‘సాక్షి’ ప్రత్యేక కథనం...

హత్యలు పెరగడానికి కారణాలు..

ఉమ్మడి జిల్లాలో ఇటీవల జరిగిన హత్యలను పరిశీలిస్తే ఆస్తి తగదాలు, వివాహేతర సంబంధాలతో పాటు ప్రేమ వ్యవహారాలూ కారణమవుతున్నాయి. ఒకచోట వివాహేతర సంబంధం కారణంగా భార్యను భర్త అంతమొందించగా మరోచోట భర్తను భార్య హత్య చేయించింది. మరోచోట స్థిరాస్తి వివాదంలో రియల్ ఎస్టేట్ వ్యాపారికి నమ్మినబంటే నమ్మించి అతి కిరాతంగా నరికి చంపేశాడు. కుటుంబ తగాదాలు, ఆస్తి వివాదాలు సమస్య ఏదైనా ఇరువురి సమన్వయంతో న్యాయపరంగా పరిష్కరించుకోవచ్చు. లేదా పెద్దల సమక్షంలో పరిష్కరించుకునే ప్రయత్నం చేయవచ్చు. కొన్ని సందర్భాల్లో కొందరికి అన్యాయం జరుగుతోంది. అన్యాయానికి గురైన వారు ప్రతీకారం తీర్చుకునేందుకు ఎంతటికైనా తెగిస్తున్నారు. ఇటీవల జిల్లాలో సుపారీ హత్యలు పెరిగిపోయాయి. దీనికి రాజకీయ నాయకుల అండ, చట్టాలు కఠినంగా లేకపోవడమే ప్రధాన కారణమని మేధావి వర్గం భావిస్తోంది. ఇలా హత్య చేసి అలా బెయిల్‌పై బయటకు వచ్చి హంతకులు యధావిధిగా ప్రజల్లోనే దర్జాగా తిరుగుతుండడం పరిపాటిగా మారింది. కొన్నాళ్లకు హత్య కేసులో సరైన సాక్షాధారాలు లేకపోవడంతో కేసులు కొట్టుడు పోవడం, కొన్ని కేసుల్లో శిక్షలు పడడం, ఇదంతా నేరం జరిగిన కొన్ని సంవత్సరాల కాలం పట్టడం ఆందోళన కలిగిస్తోంది..

రోడ్డున పడుతున్న కుటుంబాలు

హత్యలకు పాల్పడిన వారు చట్టం చేతిలోంచి తప్పించుకునే పరిస్థితులు లేవు. తెలివిగా హత్య చేసి ఆధారాలు లేకుండా తప్పించుకోవాలనుకుంటారు. పోలీసులు సాంకేతికతను ఉపయోగించి ఎక్కడో ఒకచోట చిన్న క్లూ దొరికితే నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపిస్తున్నారు. కోర్టులో జైలుశిక్ష పడడంతో నెలలు, ఏళ్ల తరబడి కుటుంబ సభ్యుల కు దూరంగా ఉంటున్నారు. అంతేకాకుండా బెయి ల్ కోసం పెద్దమొత్తంలో డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోంది. బెయిల్ వచ్చినా సమాజంలో వారిని హంతకులుగా చూస్తారు. కేసు విచారణ తర్వాత శిక్ష కూడా పడే అవకాశం ఉంటుంది. దీంతో బాధిత కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

మచ్చుకు కొన్ని సంఘటనలు

- మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గోపాల్‌వాడకు చెందిన బత్తిని శరణ్య(27) సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జియా ఉల్ హక్‌ను 2012లో హైదరాబాద్‌లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. దంపతులకు ఒక పాప జన్మించిన తర్వాత మరో యువతితో అక్రమ సంబంధం పెట్టుకుని శరణ్యకు దూరంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో శరణ్య భర్తపై కేసు పెట్టింది. దీంతో విడాకులు కావాలని భర్త కోరడంతో నిరాకరించింది. జియా ఉల్ హక్ పథకం ప్రకారం తనకు తెలిసిన వ్యక్తులకు సుపారీ ఇచ్చి 2023 ఆగస్టు 10న అతి కిరాతకంగా హత్య చేయించాడు.
- తాండూర్ మండలంలోని అచ్చులాపూర్‌కు చెందిన సిద్దం శ్రీనివాస్ (40) భార్య బానక్క తాండూర్‌కు చెందిన మేడి శంకర్‌తో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. విషయం తెలిసిన శ్రీనివాస్ పలుమార్లు మందలించాడు. దీంతో బానక్క ప్రియునితో కలిసి 2023 ఆగస్టులో భర్తను హత్య చేయించింది.
- 2023 ఏప్రిల్ 11న మంచిర్యాలకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి నడిపెల్లి లక్ష్మీకాంతారావు (63)ను అతనితో కలిసి వ్యాపారం చేస్తూ నమ్మకంగా ఉండే మామడి శ్రీనివాస్ స్థిరాస్తి విషయంలో వివాదం తలెత్తడంతో పథకం ప్రకారం హత్యచేశాడు.

చట్టాలపై అవగాహన లేకనే..



చట్టాలపై అవగాహన లేకపోవడమే ప్రధానకారణం. నేరం చేస్తే శిక్షలు ఉంటాయనే విచక్షణ జ్ఞానం కోల్పోతున్నారు. నేరం చేసిన తర్వాత జరిగే పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. తప్పు చేసిన వారు చట్టం నుంచి తప్పించుకోలేరు. నేర ప్రవృత్తిని నిర్మూలించేందుకు పోలీస్ శాఖ ఎంతగానో కృషి చేస్తోంది.

– ఎం.శ్రీనివాసులు, రామగుండం పోలీస్ కమిషనర్

విచక్షణ కోల్పోతున్నారు



మనిషిలో స్వార్థం పెరిగిపోయింది. బంధాలు, బంధుత్వాలు, ప్రేమ, ఆప్యాయతలు, అనురాగాలు కనిపించడంలేదు. దీనంతటికీ కారణం డబ్బు. ఆస్తులు, అంతస్తుల కోసమే అయిన వారిని వదులుకుంటున్నారు. దీనికి తోడు చాలామంది మద్యం, డ్రగ్స్, మత్తులో క్షణికావేశంలో హత్యలు, నేరాలకు పాల్పడుతున్నారు.

– విశ్వేశ్వర్‌రావు, మానసిక వైద్య నిపుణులు, మంచిర్యాల

రాథోడ్ రమేశ్ ప్రజల మనిషి

- ఎంపీ గోడం నగేశ్


నివాళులర్పిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఆదిలాబాద్: మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ ప్రజల మనిషిగా గొప్పస్థానాన్ని పొందారని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన రాథోడ్ రమేశ్ సంతాప సభలో ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాథోడ్ రమేశ్ మరణం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయాలకు తీరని లోటన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన ఎంతగానో కృషి చేశారన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో బీజేపీ బలోపేతానికి కృషి చేశారన్నారు. ఆయన ఆకస్మిక మరణం తీవ్రంగా కలచివేసిందన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, ఆదినాథ్, దినేష్ మటోలియా, జోగు రవి, రఘుపతి, అనిత, స్వప్న, భీం సేన్‌రెడ్డి, రాజేశ్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

రూపాయి వడ్డీకే రుణం ఇస్తామని మోసం

బోథ్: రూపాయి వడ్డీకే తిరుమల తిరుపతి దేవస్థానం హుండీ డబ్బులను రుణంగా ఇస్తామని ఆదివాసీలను మోసం చేసిన సంఘటన బోథ్ మండలంలోని పెద్దగూడలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం ఓ వ్యక్తి గ్రామానికి వచ్చి రూపాయి వడ్డీకే టీటీడీ హుండీ డబ్బులను రుణంగా ఇస్తున్నారని, ఇందుకోసం ఆన్‌లైన్‌లో ఆధార్ నంబర్‌తో దరఖాస్తు చేసుకోవాలని ఆదివాసీలను నమ్మించాడు. రుణ మంజూరుకు రూ.1,800 సెక్యూరిటీ డిపాజిట్ చెల్లిస్తే దరఖాస్తు చేసుకున్న మరుసటి రోజునే బ్యాంకు ఖాతాల్లో జమ వుతాయన్నాడు. దీంతో పలువురు సదరు వ్యక్తికి నగదు చెల్లించారు. తనకు గురువారం ఫోన్ చేయాలని నంబర్ ఇచ్చాడు. కాగా గురువారం సదరు వ్యక్తి ఇచ్చిన ఫోన్ నంబరు స్విచ్ ఆఫ్ రావడంతో ఆదివాసీలు ఖంగుతిన్నారు. తాము మోసపోయినట్లు గ్రహించారు.

కొత్త డీజీపీ ఫస్ట్ పోస్టింగ్ నిర్మల్‌లోనే..

- ఇప్పటికీ ఈ ప్రాంతమంటే మక్కువ
- జిల్లావాసులతో సత్సంబంధాలు


గతేడాది నిర్మల్‌కు వచ్చినప్పుడు వైద్యదంపతులు శోభ, సుభాష్‌రావుతో డీజీపీ దంపతులు

నిర్మల్: కొత్త డీజీపీ జితేందర్‌కు నిర్మల్‌తో సంబంధం ఉందన్న విషయం అందరికీ తెలిసిందే. ఐపీఎస్‌గా తన శిక్షణ పూర్తిచేసుకోగానే ఆంధ్రప్రదేశ్‌కు వచ్చారు. అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఏఎస్పీ)గా నిర్మల్‌లో తన తొలిపోస్టింగ్ తీసుకున్నారు. 1995 జనవరి నుంచి డిసెంబర్ దాకా దాదాపు ఏడాదికాలం ఈ డివిజన్ పోలీస్‌బాస్‌గా పనిచేశారు. అప్పటి డివిజన్ అంటే.. ఇప్పుడున్న జిల్లా మొత్తం వస్తుంది. అలా ఇక్కడి ప్రాంతంపై కొత్త డీజీపీకి పూర్తి అవగాహన ఉంది.

ఇప్పటికీ సత్సంబంధాలు..

ఏఎస్పీగా నియమితులు కాగానే ఆయన రేణుకను పెళ్లి చేసుకున్నారు. వారికి తొలి సంతానంగా ఆడబిడ్డ కూడా నిర్మల్‌లో ఉన్నప్పుడే జన్మించింది. స్థానిక ఎన్‌టీఆర్ ఆస్పత్రిలో డాక్టర్ శోభారాణి డెలివరీ చేశారు. అలా అప్పటి నుంచి వైద్యదంపతులు శోభారాణి–సుభాష్‌రావుతో డీజీపీ జితేందర్ కుటుంబం సత్సంబంధాలు కొనసాగిస్తోంది. ఎప్పుడు నిర్మల్‌వైపు వచ్చినా.. కచ్చితంగా ఇక్కడికి వస్తారని, తమ ఇంటికి వచ్చి మాట్లాడిస్తారని డాక్టర్ సుభాష్‌రావు తెలిపారు. తన తొలిపోస్టింగ్, పెళ్లి, తనకిష్టమైన ఆడబిడ్డ పుట్టడం అన్నీ నిర్మల్‌లో ఉన్నప్పుడే జరగడంతో కొత్త డీజీపీకి ఈ ప్రాంతం అంటే ఇష్టమని ఆయన వెల్లడించారు. నిర్మల్ నుంచి వెళ్లిన ఓ మంచి అధికారి పోలీస్‌శాఖలో డీజీపీస్థాయికి చేరుకోవడం చాలా సంతోషన్నిచ్చిందని చెప్పారు.

మోసాలకు పాల్పడుతున్న వ్యక్తుల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్‌టౌన్: అత్యవసరం ఉందంటూ వ్యాపారులను నమ్మిస్తూ ఫోన్‌పే ద్వారా మోసాలకు పాల్పడుతున్న వ్యక్తులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా రెంజర్ల మండలానికి చెందిన జమొల్ల భరత్, ధరంసోత్ సాయి కిరణ్, రాథోడ్ అరుణ్, రాథోడ్ జీవన్ స్నేహితులు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఫేక్ యాప్ ద్వారా డబ్బులు పంపకున్నా పంపినట్లు ఫేక్ మెసేజ్ చూపించి నిజామాబాద్, రామాయణంపేట్, కామారెడ్డి, నిర్మల్ జిల్లాలో మోసాలకు పాల్పడ్డారు. గత నెల 2న జిల్లా కేంద్రంలోని పోలీస్ పెట్రోల్ బంక్‌కు జమొల్ల భరత్ అతని స్నేహితులతో కలిసి వచ్చాడు. పెట్రోల్ పోసే వ్యక్తితో అత్యవసరం ఉందని మాయమాటలు చెప్పి రూ.8 వేల నగదు ఫేక్ ఫోన్ పే యాప్ ద్వారా పే చేసినట్లు నమ్మించి నగదు తీసుకున్నాడు. గత నెల 28న జిల్లా కేంద్రంలోని కావేరి పెట్రోల్ బంక్‌కు వచ్చి బంధువులు ఆస్పత్రిలో ఉన్నారని నమ్మబలికి వారికి ఫేక్ ఫోన్ పే యాప్ ద్వారా అమౌంట్ ట్రాన్స్‌ఫర్ చేసినట్లు చూపించి రూ.8 వేల నగదు తీసుకుని ఉడాయించారు. వ్యాపారి తమ ఖాతాను పరిశీలించే సరికి నగదు రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలిస్తుండగా గురువారం అనుమానాస్పదంగా కనిపించడంతో విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకున్నారు. నలుగురిని అరెస్ట్ చేసి వారివద్ద నుంచి నాలుగు ఫోన్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెల్లడించారు.

విద్యుత్ వైర్లు తగిలి ఒకరికి గాయాలు


గాయాల పాలైన పరమేశ్వర్

బోథ్: మండలంలోని బాబెర(కింది బాబెర) గ్రామానికి చెందిన పరమేశ్వర్ గురువారం గ్రామంలోని విద్యుత్ స్తంభాలకు లైట్లు అమరుస్తుండగా 6.3 కేవీ కెపాసిటీగల విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై కిందపడడంతో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ముందుగా బోథ్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుండి ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు.

అనుమతి లేకుండానే విద్యుత్ నిలిపివేత...

విద్యుత్ సిబ్బంది అనుమతి తీసుకోకుండానే పరమేశ్వర్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ నిలిపివేశాడని సబ్ ఇంజినీర్ వెంకటేష్ పేర్కొన్నారు. దీంతోనే విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురయ్యాడన్నారు. తమకు సమాచారం అందిస్తే తామే విద్యుత్ సరఫరా నిలిపేసేవారమన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

నేరడిగొండ: మండలంలోని మాధపూర్‌లో మతిస్థిమితం లేనివ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన కుమ్రం సురేందర్ (56) గురువారం వ్యవసాయ పంట క్షేత్రంలో మృతి చెంది ఉండగా స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతునికి ఇద్దరు భార్యలతో పాటు ఐదుగురు పిల్లలు ఉన్నారు.

ఇసుక డంపులు సీజ్

చెన్నూర్‌రూరల్: నర్సక్కపేట, పొగెపల్లి, ముత్తరావుపల్లి గ్రామ సమీపంలోని పంట పొలా లు, ఇళ్ల సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసు క డంపులను గురువారం సీజ్ చేసినట్లు చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్ తెలిపారు. పలువురు ట్రాక్టర్ యజమానులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

సీఎం దృష్టికి ట్రిపుల్‌ఐటీ సమస్యలు

- పరిష్కారం కోసం విద్యార్థుల నిరీక్షణ
- ఏళ్లుగా సమస్యలతోనే చదువులు
- రెగ్యులర్ వీసీని నియమించాలని వినతులు
- ఆస్పత్రి ఆధునికీకరించాలని వేడుకోలు


బాసర ట్రిపుల్‌ఐటీ

భైంసా: బాసరలోని ట్రిపుల్‌ఐటీ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల్లో కొంత మంది హైదరాబాద్‌కు వెళ్లారు. యూనివర్సిటీ స్టూడెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆకాశ్ బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ట్రిపుల్‌ఐటీలోని పరిస్థితుల గురించి విన్నవించారు. సీఎం హోదాలో ఒక్కసారి ట్రిపుల్‌ఐటీని సందర్శించాలని విజ్ఞప్తి చేశారు. సమయం చూసి తప్పకుండా వస్తానని సీఎం హామీ ఇచ్చారు. రెండేళ్ల క్రితం వేలాది మంది విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేసి యూనివర్సిటీ రోడ్లమీద నిరసనలు తెలిపారు. అప్పట్లో టీపీసీసీ అధ్యక్షులుగా రేవంత్‌రెడ్డి పోలీసు వలయాలను దాటుకుని ట్రిపుల్‌ఐటీ గోడ దూకి విద్యార్థుల వద్దకు వెళ్లారు. అప్పటి సమస్యలు ఇప్పుడూ అలాగే ఉన్నాయి. ఈ సమస్యలపై విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో ఓ కమిటీ వేసి పరిష్కారం కోసం దృష్టి పెట్టారు. ఈ నేపథ్యంలో విద్యార్థులే హైదరాబాద్‌కు వెళ్లి సీఎంను కలిసి 19 సమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. సీఎం సూచనమేరకు ఆయన వ్యక్తిగత సలహాదారు జైపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

సమస్యలు ఇవే...

- బాసర ట్రిపుల్‌ఐటీలో రెగ్యులర్ వీసీ ఉండాలి. అలా ఉంటే ఇక్కడి అన్ని విభాగాలపై దృష్టి సారిస్తారు. విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలు గమనిస్తారు. ఫలితంగా ఇక్కడే పరిష్కారం అవుతాయి.
- ట్రిపుల్‌ఐటీలో సరైన ఫ్యాకల్టీ లేదు. చాలా విభాగాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- ఆస్పత్రిని ఆధునీకరించి వైద్యసేవలు విస్తరించాలి.
- విద్యార్థుల ఆత్మహత్యలపై దృష్టి సారించాలి. ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఎంతో మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ విషయాలపై ఇప్పటి వరకు సరైన ఆధారాలు సేకరించలేకపోతున్నారు. ఆత్మహత్యలు జరిగిన సమయంలో ఏదో ఒక సమాధానం ఇచ్చి దాటవేస్తున్నారు. ఆత్మహత్యలకు గల కారణాలను తెలుసుకోవడంలేదు.
- విద్యార్థుల తల్లిదండ్రులను లోనికి అనుమతించకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చినవారు ప్రధాన గేటువద్దే నిరీక్షిస్తున్నారు.
- విద్యార్థుల సమస్యలు చెప్పుకునేందుకు ప్రత్యేక కమిటీని నియమించాలి.
- మెస్‌లలో రుచికరమైన భోజనాలు ఉండడం లేదు. పాత మెస్ టెండర్లను రద్దు చేయాలి. కొత్త టెండర్లు వేసి నాణ్యమైన, రుచికరమైన భోజనాలు అందించాలి.
- విద్యార్థులకు సరిపడా క్రీడాపరికరాలు అందించాలి.
- హాస్టల్ గదుల్లో మౌలిక వసతులు లేవు. బెడ్లు, ఇతర ఫర్నిచర్ పూర్తిగా దెబ్బతిన్నాయి. కొత్త ఫ్యాన్లు బిగించాలి.
- విద్యార్థులకు సంబంధించిన కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు విద్యాసంవత్సరం ప్రారంభంలోనే అందించాలి.
- సెంట్రల్ లైబ్రరీలో మరిన్ని సౌకర్యాలు కల్పించాలి.
- బయటి నుంచి వచ్చే మత్తు పదార్థాలను అరికట్టాలి.

రూ.5 కోట్లతో తరోడ వద్ద బైలీ బ్రిడ్జి


బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే శంకర్

జైనథ్: జైనథ్–బేల 353–బి జాతీయ రహదారిపై తరోడ వద్ద రూ.5 కోట్లతో బైలీ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించినట్లు ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. గురువారం హైదరాబాద్ నుండి బ్రిడ్జిని పరిశీలించేందుకు వచ్చిన ఎన్‌హెచ్ఏఐ రీజినల్ ఆఫీసర్ ఎస్ కే కుష్వా హ్‌తో కలిసి తరోడ వద్ద కుంగిన పాత బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వాగుపై నిర్మించిన తాత్కాలిక వంతెన కొట్టుకుపోయిందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కొత్త జాతీయ రహదారి పనులు ఆలస్యం అయ్యాయని ఆరోపించారు. జాతీయ రహదారి నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా రాకపోకలు సాగించేందుకు తాత్కాలిక స్టీల్ బ్రిడ్జి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఆస్పత్రి సిబ్బందిపై దాడి

ఎదులాపురం: ప్రైవేట్ ఆస్పత్రి సిబ్బందిపై దాడి చేసిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. బేల మండలానికి చెందిన కె. సంజయ్‌కి కిడ్నీలో రాళ్లు కావడంతో ఈనెల 9న స్థానిక నక్షత్ర ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యాడు. వైద్యులు సర్జరీ చేసి ఐసీయూకి మార్చగా, సంజయ్ వాంతులు చేసుకోవడంతో అతడి తమ్ముడు సంతోష్ వేరే ఆస్పత్రికి తీసుకెళ్తానని అడగగా అదే రోజు సాయంత్రం వైద్యులు వేరే ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ క్రమంలో ఆస్పత్రి మేనేజ్‌మెంట్ చికిత్సకు సంబంధించి బిల్ అడగడంతో డబ్బులు ఇచ్చేది లేదంటూ ఆస్పత్రి సిబ్బందిపై సంజయ్ తమ్ముడు సంతోష్, కుమారుడు సచిన్, కూతురు దాడికి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు.

కిరాణంలో చోరీ

ఎదులాపురం: పట్టణ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ కిరాణా దుకాణంలో గురువారం రాత్రి చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. అటెండర్ కాలనీలో నివాసం ఉంటున్న జాలం మల్లేశ్ బుధవారం రాత్రి 10 గంటలకు దుకాణం బంద్ చేసి ఇంటికి వెళ్లాడు. గురువారం తెల్లవారుజామున వెళ్లి చూడగా షటర్ తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా కౌంటర్‌లోని రూ.2 వేల నగదు, జెమినీ టీడబ్బాలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

గంజాయి పట్టివేత

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బూర్నూర్ కు చెందిన పెందూర్ లక్ష్మణ్ వద్ద గురువారం 800 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. గ్రామానికి చెందిన లక్ష్మణ్ గాదిగూడ మండలం కట్టగూడకు చెందిన మెస్రం లింగు వద్ద గంజాయి తీసుకుని ఆదిలాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో వాహనాలు తనిఖీలు చేస్తున్న క్రమంలో లక్ష్మణ్ పరారీ అవుతుండగా అదుపులోకి తీసుకుని తనిఖీ చే యగా అతని వద్ద గంజాయి లభించింది. గంజాయి, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కాగా మెస్రం లింగు పరారీలో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.